క్లుప్తంగా

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కార ఫైల్‌ను అందించిన ఉజ్వల మిత్రమండలి సభ్యులు

ఆదోని సెంట్రల్: ఆదోని ఉజ్వల మిత్రమండలి ఆధ్వర్యంలో ప్రతి పాఠశాల నుంచి పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేశారు. ఆ విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతి, ఎగ్జిక్యూటివ్ ఫైల్‌ను అందించినట్లు ఉజ్వల మిత్రమండలి అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి.సత్యన్న తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పాఠశాలలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్ హాజరై మాట్లాడారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని చెప్పారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. ఉజ్వల మిత్ర మండలి ఆర్థిక కార్యదర్శి స్వామినాథ్, పూర్వపు అధ్యక్షుడు ప్రహ్లాద, సభ్యులు నాగన్న, వెంకటేష్, భోజరమేష్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులతో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదోని రూరల్: ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కర్నూలు జిల్లా నాయకులు సంగిపాగు నాగప్ప మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం బండిమెట్ట 21వ వార్డు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి జూలై 7వ తేదీన నాటికి 30 ఏళ్లు అవుతుందన్నారు. ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి గ్రామంలో, వార్డుల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరపాలని పిలుపునిచ్చారు. నాయకులు జగన్, పట్టణ కన్వీనర్ నరసింహులు, వార్డు అధ్యక్షులు సంజయ్, ఉపాధ్యక్షుడు పండు తదితరులు పాల్గొన్నారు.

ఈరన్న స్వామి సన్నిధిలో పూజలు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామిని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తిక్కారెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు దేవాలయం డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్, అర్చకులు స్వాగతం పలికి ఆలయంలో పూజల అనంతరం శాలువా పూలమాలతో సన్మానించారు. ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి డిప్యూటీ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. ఉరుకుంద ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్లు చెన్నబసప్ప, శివమోహన్ రెడ్డి, నాయకులు వెంకటపతిరాజు, కొట్రేష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలపై పోరాటం



అభివాదం చేస్తున్న కేవీపీఎస్ నూతన కార్యవర్గ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: దళితుల సమస్యలపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో పోరాటాలు సాగిస్తామని ఆ సమితి జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు దేవసహాయం, కరుణాకర్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో ఎమ్మిగనూరు మండల కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సోగనూర్ తిమ్మన్న, ఉపాధ్యక్షులుగా ఎర్రకోట అరుణ్, లక్ష్మన్న, భాస్కర్, కార్యదర్శిగా కోటేకల్ చిన్నప్ప, సహాయ కార్యదర్శులుగా ఏనుగుబాల కుర్నెలి, రాముడు, రాజు, కోశాధికారిగా కందనాతి దేవేంద్రలతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదోనిలో రైలును నిలపాలి

ఆదోని అర్బన్: డివిజన్ కేంద్రం ఆదోని మీదుగా ప్రతి గురువారం యశ్వంత్‌పూర్ నుంచి జైపూర్‌కు వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు (రైలు నంబర్ 82654) వెళ్తోందని, ఆ రైలుకు ఆదోనిలో స్టాపింగ్ కేటాయించేలా రైల్వే బోర్డు అధికారులతో మాట్లాడాలని ముస్లిం, మైనార్టీ నాయకులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిని కోరారు. ఈ మేరకు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. రాజస్థాన్‌లో ప్రముఖ పుణ్యక్షేత్రాలు, జైన దేవాలయాలు, హజరత్ ఖ్వాజాగరీబ్ నవాజ్ దర్గాలు ఉన్నాయని, వాటిని దర్శించుకునేందుకు ముస్లింలు, జైనులు, వివిధ వ్యాపారాల నిమిత్తం ఆదోని ప్రాంతం నుంచి వ్యాపారస్తులు, అన్ని వర్గాల ప్రజలు జైపూర్‌కు వెళ్తుంటారన్నారు. గతంలో దీనిపై రైల్వే అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి జైపూర్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలుకు ఆదోనిలో స్టాపింగ్ ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయంపై రైల్వే శాఖ అధికారులతో మాట్లాడి ఆదోనిలో స్టాపింగ్ ఇచ్చేలా కృషి చేస్తానన్నారు.

- ఈ యేడాది మే నెలలో పత్తికొండలో తాయప్ప అనే వ్యక్తి కుమారుడు మిద్దెపై చదువుకునేందుకు ఓ లైట్ వేసుకున్నాడు. వర్షం రావడంతో ఉదయం మిద్దెపైకి వెళ్లగా డ్యామేజ్ వైర్ నీటిలో పడి ఉండగా తీసే క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు.
- ఈ నెల 22వ తేదీన కుప్పగల్ గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి పొలానికి వెళ్లి మోటార్ ఆన్ చేయడంతో షాక్‌కు గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు రెఫర్ చేశారు.
- గతేడాది ఆగస్టులో పట్టణంలో అయ్యమ్మ అనే వృద్ధురాలు ఇంటి ముందు కూర్చొని ఉండగా గాలికి పై నుంచి విద్యుత్ తీగ పడి విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందింది.
- ఈ యేడాది మార్చి నెలలో..డివిజన్ పరిధిలోని పత్తికొండలో దర్గా మన్సూర్ బాషా అనే వ్యక్తి ఇంటి వద్ద శుభ్రత పనులుచేస్తుండగా దెబ్బతిన్న వైర్‌ను పట్టుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు.
- గతేడాది జనవరిలో మండలంలోని బసాపురం గ్రామ పొలంలో కొత్త లైన్ ట్రాన్స్‌ఫార్మర్ వేయడానికి కాంట్రాక్టర్ తరఫున వచ్చిన బసాపురం గ్రామానికి చెందిన గోవింద్ విద్యుత్ సరఫరా చూసుకోకుండా పనులకు పూనుకోవడంతో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు.

పరిశ్రమలు, ఇళ్లల్లో, వ్యవసాయ పొలంలో ఎక్కడో ఒకచోట విద్యుత్ షాక్‌కు గురై ప్రాణనష్టం చోటు చేసుకుంటోంది. ఇలాంటివి పునరావృతం కాకుండా విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినా అజాగ్రత్త, నిర్లక్ష్యం, తెలియనితనంతో ప్రాణాలు పోవడం, అవిటివాళ్లు కావడం తప్పడం లేదు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ నెల వరకు 13 మంది విద్యుత్ షాక్‌కు గురై మరణించారు. 15 పశువులు మృత్యువాత పడ్డాయి. అంతేగాకుండా మరో ఆరుగురు గాయాలపాలై ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గాయపడిన కుప్పగల్‌కు చెందిన వెంకటేష్ (ఫైల్)

విద్యుత్ ప్రమాదం.. అప్రమత్తతతో దూరం

- ఎలక్ట్రికల్ ఉపకరణాల పర్యవేక్షణ తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించకుంటే ప్రాణనష్టం వాటిల్లే ప్రమాదం

ఆదోని అర్బన్: అవసరం.. తెలియనితనం.. నిర్లక్ష్యం.. అజాగ్రత్త విద్యుత్ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వర్షాకాలం మొదలవడంతో విద్యుత్ ప్రమాదాలు అదికంగా చోటు చేసుకునే అవకాశముంది. పలు జాగ్రత్తల ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు.

- వేసవి కాలం పోయింది.... వర్షాకాలం ఆరంభమయ్యింది. మరోవైపు పిడుగులు, ఉరుములు, మెరుపులు, నేలకొరుగుతున్న విద్యుత్ స్తంభాలు, వృక్షాలు. ఇళ్ల కుప్పకూలడం ఇలాంటివి జరుగుతున్న సమయంలో విద్యుత్ తీగలు కిందకు పడడం, తడిగా ఉన్న విద్యుత్ స్తంభాలు ఉండడం, వాటిని తాకడం వల్ల విద్యుత్‌షాక్ వస్తుంది. అంతేగాకుండా ఇళ్లల్లో తడి చేతితో స్విచ్‌లను తాకడం, ఇళ్లలో ఎర్తింగ్ లేకపోవడం, విద్యుత్ సమస్య వచ్చిన వెంటనే అవగాహన లేక విద్యుత్‌ను తాకడం వల్ల కూడా షాక్‌కు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే వ్యవసాయభూముల్లో గాలికి పడిన తీగలను ముట్టుకోవడం, ఎద్దులను విద్యుత్ స్తంభాలకు కట్టి వేయడం వల్ల మనుషులు, పశువులు షాక్‌కు గురవుతున్నాయి.



ఇలాంటి ప్రమాదాల నుంచి బయటపడేందుకు విద్యుత్‌శాఖ అధికారులు చెప్పిన సూచనలు పాటిస్తే ప్రమాదమే ఉండదని విద్యుత్‌శాఖ ఏడీఈ పురుషోత్తం తెలిపారు.

జాగ్రత్తలు ఇలా..

డివిజలోని డివిజన్ పరిధిలోని ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు, మంత్రాలయం పరిధిలో 3,58,821 గృహ , 54,399 వ్యవసాయ, 1333 పరిశ్రమల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి.

- తడి చేతులతో, తడిచి ఉన్న విద్యుత్ పరికరాలను తాకరాదు.
- విద్యుత్ పనులు సొంతంగా నిర్వహించుకోరాదు.
- విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నా, వేలాడుతున్నా పట్టుకోరాదు. ఆ వైపు ఎవరినీ వెళ్లకుండా చూడాలి. వెంటనే సంబంధిత లైన్‌మెన్, అధికారికి సమాచారం అందించాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజులు పోయినప్పుడు సొంతంగా వేయరాదు
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లపైకి అనధికారిక వ్యక్తులు ఎక్కరాదు.
- మోటార్ సామర్థ్యానికి గల నాణ్యత కలిగిన తీగలను వాడాలి.
- సర్వీసు వైర్లు అతుకులు, జాయింట్లు వదులుగా ఉండడం, స్టార్టర్‌లు, తీగలను నేలపై పెట్టడం ప్రమాదకరం. స్టార్టర్‌కు పైకప్పు తొలగించకూడదు. స్టార్టర్ ఉంచిన ఐరన్ బాక్సును తెరిచే సమయంలో జాగ్రత్తగా ఉంచాలి. మోటార్‌కు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించుకోవాలి. తడి ఉన్నప్పుడు పంపుసెట్‌ను ఆన్ చేయరాదు.
- విద్యుత్ లైన్ల కింద చెట్లు నాటడం, తీగలకు తాకిన చెట్లు, కొమ్మలను ఎక్కడం వంటివి చేయరాదు.
- స్తంభాలకు ఆధారంగా ఉన్న స్టే తీగను తొలగించడం, వాటికి పశువులను కట్టివేయరాదు. పొలంలో తెగిపడి ఉన్న తీగలను చేతితో తొలగించడం, పక్కకు జరపడం వంటివి చేయరాదు.
- పొడవైన ఇనుపరాడ్లు, బోరుపైపులు, కేసింగ్ పైపులు తీసుకెళ్లేటప్పుడు విద్యుత్ తీగలకు తాకకుండా జాగ్రత్తలు వహించాలి.
- ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే వెంటనే స్విచ్ ఆఫ్ చేసి ప్లాస్టిక్ లేదా పొడవాటి కర్రతో ఆ వ్యక్తిని తప్పించాలి.
- ఐఎస్ఐ మార్కు కలిగిన పంపుసెట్ వాడడం వల్ల కరెంట్ పొదుపు అవ్వడంతో పాటు ప్రమాదాలను నివారించవచ్చు.
- మోటార్‌లకు కెపాసిటర్‌లను పెట్టుకోవడం వల్ల కరెంట్ ఆదాతో పాటు ఓల్టేజీ సమస్య తగ్గుతుంది.
- విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, ఓల్డర్‌లు, పరికరాలను నాణ్యత కలిగిన వాటినే ఉపయోగించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు. ఇంట్లో స్విచ్ బోర్డులను తగినంత ఎత్తులో ఉంచుకోవాలి. దీంతో పిల్లలకు సురక్షితం.
- ప్రతి ఇంట్లో విద్యుత్ సర్వీసుకు ఎర్తు పైపు ద్వారా ఎర్తింగ్‌ను ఏర్పాటు చేయాలి.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు ముట్టుకోరాదు.
- ఇళ్ల, ఇతర నిర్మాణాలు జరుగుతున్నప్పుడు విద్యుత్‌శాఖ సిబ్బందికి తెలియజేయాలి. తడి చేతులతో, తడికాళ్లతో ఉన్నప్పుడు స్విచ్‌లను వేయరాదు. అవసరమైతే రబ్బర్ చెప్పులను వాడాలి. విద్యుత్ సమస్య వస్తే ఇతర ప్రైవేట్ వ్యక్తులను సంప్రదించకుండా విద్యుత్‌శాఖ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలి. ఇళ్ల మిద్దెలపై బట్టలను విద్యుత్ లైన్‌లపై ఆరవేయరాదు.
- ఏదైనా విద్యుత్ ప్రమాదం జరిగితే సమస్య పరిష్కారానికై విద్యుత్‌శాఖ సిబ్బందికి లేదా 1912కి తెలియజేయాలి.

నిర్లక్ష్యం.. ప్రాణానికే ప్రమాదం



పరిశ్రమలు, ఇళ్లల్లో, వ్యవసాయ రంగంలో విద్యుత్ పట్ల నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ప్రమాదం. విద్యుత్ సమస్య వస్తే వెంటనే 1912కు సమాచారం ఇవ్వండి. లేదా దగ్గరలోనే విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేయండి. సొంతంగా పరిష్కారానికి పూనుకోరాదు. విద్యుత్‌పై ప్రజలు, పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పురుషోత్తం, విద్యుత్‌శాఖ ఏడీఈ

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

- 318 మందికి కంటి పరీక్షలు చేసిన వైద్యులు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆదోని అర్బన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్), ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (అవోపా) సంయుక్త ఆధ్వర్యంలో నంద్యాల శాంతిరామ్ ఆస్పత్రి, ఆరోగ్యశ్రీ వారి సహకారంతో ఎన్నారై కాకుబాల్ నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించని ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక హరళయ్య స్వామి ఆలయం వద్ద ఉచిత కంటి ఆపరేషన్ల శిబిరానికి ముఖ్య అతిథులుగా రాచోటి సుధాకర్, దాత కాకుబాళ్ నగేష్, వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా, మమతాశ్రీ, చెన్నబసపప మరియాల శ్రీధర్, విశ్వనాథ్, రఘు, శ్రీదేవి తదితరులు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. శిబిరంలో దాదాపు 318 మందికి కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. పలువురిని ఆపరేషన్లకు రెఫర్ చేసినట్లు అవోపా ప్రెసిడెంట్ వంకదారి శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. అవసరమైన వారికి కళ్లద్దాల పంపిణీతో పాటు ఆస్పత్రిలో ఉండేందుకు వసతి, భోజన సౌకర్యం, ఆదోని-నంద్యాల రానుపోనూ రవాణా సౌకర్యం కూడా ఉచితంగా కల్పించి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదోని పట్టణ వామ్, అవోపా సభ్యులు నాయకంటి రఘు, డాక్టర్ రంజిత్‌కుమార్, యాదగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ చట్టానికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఆనందబాబు

కౌతాళం: ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టానికి దళిత గిరిజనుల జనాభా ప్రతిపాదికన నిధులు కేటాయించి పకడ్బందీగా అమలు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో ఆదివారం కౌతాళం మండల జనరల్ బాడీ సమావేశం కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షుడు వీరేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆనంద బాబు, జిల్లా సహాయ కార్యదర్శి చిన్న మారయ్య మాట్లాడుతూ.. తరాలు మారుతున్నా దళితుల తలరాతలు మాత్రం మారడం లేదని, దీనికి కారణం దళితులను అణిచివుంచిన నాటి మనువాద భావజాలం నేటికి కొనసాగడమే అన్నారు. సామాజిక స్థితిగతులు మారాలంటే జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేయడం తప్ప మరో మార్గం లేదన్నారు. నూతన ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. చట్టాన్ని పాలకులు అమలు చేసేలా గ్రామ గ్రామాన సంఘాన్ని నిర్మించి కార్యకర్తలంతా ఉద్యమించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకులు రామకోటి, హనుమంతు, మండల కార్యదర్శి తాయప్ప, జయరాం, ఆదాం, శ్రీరాములు, తిక్కయ్యలు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



మాట్లాడుతున్న ఆకాశవాణి దూరదర్శన్ సీనియర్ టెక్నీషియన్ గణపతి

ఆదోని సెంట్రల్: ఆకాశవాణి దూరదర్శన్ కేంద్రంలో సీనియర్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న మహమ్మద్ జాకీర్ బాషా పదవీ విరమణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆదివారం సెల్లీ స్కూల్ అవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆకాశవాణి దూరదర్శన్ కేంద్రం సీనియర్ టెక్నీషియన్ గణపతి మాట్లాడుతూ.. విధుల పట్ల అయనకు ఉన్న అంకిత భావం, సమయస్ఫూర్తిని కొనియాడారు. తోటి ఉద్యోగులతో స్నేహభావం, ప్రేమ, ఆప్యాయత కలిగి పనిచేశారన్నారు. అనంతరం తోటి ఉద్యోగులు, బంధుమిత్రులు పదవీవిరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, టెక్నీషియన్ రామకృష్ణ, ఆకాశవాణి దూరదర్శన్ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలో పలు విభాగాల్లో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఆదివారం డిపో ఆవరణలో మేనేజర్ అమర్నాథ్‌తో పాటు అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు, సూపరింటెండెంట్ పంపాపతి, సిబ్బంది ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన ఏడీసీలు, డ్రైవర్లు, కండక్టర్లు కేఎం సాహెబ్, రామాంజనేయులు, యు.గోపాల్, యు.రాముడు, అన్వర్‌బాషా, బుట్టా నరసింహులు, మగ్బుల్‌బాషాలను శాలువా, పూలమాలలతో సత్కరించారు.

బండలాగుడు విజేత మాచెర్ల వృషభాలు



రాంపల్లిలో రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

తుగ్గలి: సద్గురు కాశిరెడ్డినాయన ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాంపల్లిలో రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను బహుమతి దాత అవుకు మండలం సంగపట్నం లక్ష్మీదేవి ప్రారంభించారు. వైఎస్సార్ జిల్లా మాచెర్లకు చెందిన బ్రహ్మానందరెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఒంగోలు జిల్లా గుర్లమానుదొడ్డి కుర్వ కర్రెప్ప వృషభాలు, ఓర్వకల్లు మంగలి నడిపన్న వృషభాలు, అనంతపురం జిల్లా బొందలదిన్నె జంగం సోదరుల వృషభాలు, పెండేకల్లు నాగభూషణం వృషభాలు నిలిచాయి. విజేతలకు బహుమతి దాతలు వరుసగా సంగపట్నం లక్ష్మీదేవి రూ.40 వేలు, రాంపల్లి కిష్టప్ప, నల్లగుండ్ల రామయ్య, అగ్రహారం కోదండ రాముడు రూ.30 వేలు, పగిడిరాయి నెట్టికంటి రూ.20వేలు, రాంపల్లి రాజు, లక్ష్మన్న, చనుగొండ్ల సుంకన్న రూ.15 వేలు, రాంపల్లి మొట్టి హనుమంతు రూ.10వేలు అందజేశారు.

ఆటోడ్రైవర్లకు అండగా ఉంటాం



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆటో కార్మికులకు అండగా ఉంటానని, ఏదైనా సమస్య వస్తే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సూచించారు. స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద ఆటో కార్మికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఆటో కార్మికులకు సంఘీభావంగా ఆయన ఖాకీ చొక్కా ధరించి మాట్లాడారు. ఆటో కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- పట్టణంలోని జైన్ మతస్తుల కులదైవం పార్శ్వనాథుడిని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఆదివారం దర్శించుకున్నారు. స్థానిక విక్టోరియాపేటలో వెలసిన జైన్ మందిరానికి వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ మతస్తులతో పరిచయ సమావేశం ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌జైన్, మున్సిపల్ మాజీ చైర్మన్ దేవరాజ్, నాగరాజుగౌడ్, మతపెద్దలు పాల్గొన్నారు.
- పట్టణంలోని టీజీఎల్ కాలనీలో ఉన్న ఈద్గాను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సందర్శించారు. ముందుగా ముస్లిం మత పెద్దలను కలిశారు. ఈద్గా కట్టడాలను పరిశీలించారు. అనంతరం ముస్లింలు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మైనార్టీలకు సంబంధించిన నిధుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులతో చర్చించానని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలి

హ్యూమన్ రైట్స్, యాంటీ కరప్షన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదోనిలో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. ఆ అసోసియేషన్ జిల్లా చైర్మన్ హెచ్.కె.శ్రీకాంత్‌రావు, మెంబర్ గుమ్మల బాలస్వామి మాట్లాడుతూ..

నిర్మల్ టాకీసు నుంచి శ్రీనివాస్‌భవన్ వరకు రోడ్లపై బైకులు, ఆటోలు అడ్డంగా నిలుపుతుండడం వల్ల వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రోడ్ల పక్కన ఉండే షాపులన్నింటికీ పార్కింగ్ స్థలాన్ని కేటాయించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించకుండా చూడాలని కోరారు. అలాగే రోడ్డు పక్కనున్న కాలువలపై ఫుట్‌పాత్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. సభ్యులు జె.శ్రీకాంత్, కె.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు ఇవ్వాలి

ఆదోని సెంట్రల్: ఎస్సీ సంక్షేమ హాస్టల్ ప్రవేశానికి దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థికి హాస్టల్ సీటు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆదోని పట్టణంలోని ఎస్సీ సోషల్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రంగలక్ష్మిదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆదోని వెనకబడిన ప్రాంతమని, విద్యార్థుల తల్లిదండ్రులు వేరే రాష్ట్రానికి వలస వెళ్తున్న పరిస్థితి నెలకొందన్నారు. ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థులకు సీట్లు లేకపోవడం వల్ల విద్యను మధ్యలోనే ఆపాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని హాస్టళ్లలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలని కోరారు. అలాగే ఎస్సీ హాస్టల్‌లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, పవన్, మోహన్, ఉదయ్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మృతి

కృష్ణగిరి: కడుపునొప్పి తాళలేక చీమల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందింది. ఎస్ఐ ఖాజావలి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సందు నాగన్న, గిడ్డమ్మ(50) దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. నాగన్న ఐస్ బండి నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గిడ్డమ్మ కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతూ పలు ఆస్పత్రుల్లో చూపించుకుంది. ఈ నెల 28న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీమల కోసం తీసుకొచ్చిన మందును నీటిలో కలుపుకుని తాగింది. సాయంత్రం ఐస్ అమ్ముకుని ఇంటికి వచ్చిన నాగన్న భార్య అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి వెంటనే డోన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సర్వజన ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కొలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతురాలి కుమారుడు సందు వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జయప్రదం చేయండి

గోనెగండ్ల: జూలై 4న ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వి.భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం గోనెగండ్లలో ఆ సంఘం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల నీట్ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఐఎస్ఎస్ ముంబాయి, ఐఐటీ ముంబాయి నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వరకు విద్యార్థి సంఘ నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, యూనివర్సిటీల్లో స్వేచ్ఛా వ్యక్తీకరణ ప్రజాస్వామ్య అణచివేత చర్యలను ఆపాలన్నారు. నీట్ మరియు ఇతర పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వానికి చేతగాకనే నీట్, పీజీ పరీక్ష తేదీని మూడు సార్లు మార్చిందని ఎద్దేవా చేశారు. అసమర్థ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

దివ్య ఔషధం నేరేడు



కోసిగిలో నేరేడు పండ్లను విక్రయిస్తున్న వ్యాపారి

కోసిగి: నల్లటి నేరేడు పండ్లను చూస్తే చాలు నోరూరుతుంది. దివ్య ఔషధంగా నేరుగా పండ్లు ఉపయోగపడుతుంటాయి. ఆ పండ్లు కోసిగి మండలంలో బాగానే లభ్యమౌతున్నాయి. ఏటా వర్షాలు పడిన వారానికే చెట్ల నుంచి పండ్లు రాలి కిందకు పడుతుంటాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి నెలరోజుల పాటు ఈ పండ్లు ముమ్మరంగా లభిస్తుంటాయి. కోసిగి మండలంలో రైతుల పొలాల్లో 400 నుంచి 500 దాకా నేరేడు చెట్లు ఉన్నాయి. రోజుకు వెయ్యి కేజీల దాకా పండ్లు లభిస్తాయి. కొందరు రైతులు పండ్లను నేరుగా విక్రయిస్తుండగా, మరికొందరు రైతులు చెట్లను లీజుకు ఇస్తారు. రోజు వేకువజామున 4 గంటలకల్లా చెట్టు దగ్గరకు వెళ్లి పండ్లను రాల్చి ఏరుకుని 6 గంటల్లోగా ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్దకు చేరుకుంటున్నారు. అక్కడ కొనుగోలుదారులకు, వ్యాపారస్తులకు చేరు (కేజీ) రూ.50 నుంచి రూ.60 ప్రకారం విక్రయిస్తారు. చిరు వ్యాపారస్తులు వాటిని గంపలలో వేసుకుని రైళ్లలో, బస్సులలో ఇతర పట్టణాలకు తరలించి అమ్మకాలు చేపడుతుంటారు. చుట్టుపక్కల ఉన్న కర్ణాటక రాష్ట్రంలోని రాయచూరు, ఆదోని, ఎమ్మిగనూరు, గుంతకల్లు పట్టణాల్లో రూ.200లకు కేజీ ప్రకారం అమ్మకాలు చేపడతారు. ఈ పండ్లను షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా కొనుగోలు చేస్తుంటారు. ఉదయం లేచిన వెంటనే ఈ పండ్లు తింటే షుగర్, బీపీలను అదుపు చేస్తుంది. దీంతో ఈ పండ్లను పట్టణ ప్రజలు అధికంగా కొనుగోలు చేస్తుంటారు. ఔషధ గుణాలు కలిగిన నేరేడు పండ్లతో చిరు వ్యాపారస్తులకు కూడా నెల రోజుల పాటు ఉపాధి లభిస్తోంది.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

గోనెగండ్ల: జూలై నెలకు సంబంధించి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పక్కాగా చేపడతామని ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. ఆమె ఆదివారం మాట్లాడుతూ.. మండలంలో 9,238 సామాజిక పింఛన్లు ఉన్నాయని, జూలై 1, 2 తేదీల్లో గ్రామ సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వచ్చి పంపిణీ చేస్తారని తెలిపారు. పింఛన్‌దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.